సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం ¡ 19 ¡ ఫిబ్రవరి ¡ 2024



..అధ్యాపకుల అవస్థలు

జూనియర్ కళాశాలల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్లకు వేతనాలు రాక అవస్థలు పడుతున్నారు.

వివరాలు 8లో ▸



ముగిసిన బ్రహ్మోత్సవాలు

అయిజ మండలం ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ముగిశాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.6 /12.7

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రివేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కల్వకుర్తి మార్కెట్‌కు భారీగా వేరుశనగ



కల్వకుర్తి: కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు ఆదివారం రైతులు వేరుశనగను భారీగా అమ్మకానికి తీసుకొచ్చారు. మార్కెట్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 240 మంది రైతులు 8,947 బస్తాల్లో 2,684 క్వింటాళ్ల వేరుశనగను తీసుకొచ్చారు. అత్యధికంగా రూ.7,169 ధర లభించగా, మధ్యస్థంగా రూ.6,669 ధర, అత్యల్పంగా రూ.4,421 ధర లభించింది. వేరుశనగకు ధరల్లో స్వల్ప హెచ్చు తగ్గులు వస్తుండటంతో రైతుల్లో ఆవేదన, ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఓపెన్ డిగ్రీలో చేరికకు మరో అవకాశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో ఇంటర్, ఎస్సెస్సీ పూర్తి చేసినవారు పీజీ, డిగ్రీలో చేరేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ చేయాలని ఉన్నవారు, ఉద్యోగాలు చేసేవారు దూరవిద్య పద్ధతిలో చదువుకునేందుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవకాశం కల్పిస్తుందన్నారు. ఇప్పటికే పలుమార్లు తేదీలను పొడిగించిన ప్రభుత్వం తాజాగా మరోమారు అవకాశం కల్పించిందన్నారు. ఈ నెల 29 వరకు ఎలాంటి ఫీజు లేకుండా చేరవచ్చని, వచ్చే నెల 30లోపు అపరాధ రుసుంతో అడ్మిషన్ పొందవచ్చన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పీజీలో ఇప్పటికే 1,652 మంది, డిగ్రీలో 877 మంది అడ్మిషన్ పొందారన్నారు. గడువు పూర్తయ్యేలోగా మరింత మంది చేరే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గలవారు సకాలంలో ఫీజులు చెల్లించి అడ్మిషన్లు తీసుకోవచ్చని సూచించారు.

డీఈఓపై దాడికి యత్నం

- ప్రొటోకాల్ విస్మరించారంటూ ఆగ్రహం
- పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే.. వెనుదిరిగిన ఎమ్మెల్యే

– తాడూరు



వివరాలు 8లో

నల్లమల భద్రం..!

ఎకో సెన్సిటివ్ జోన్‌గా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్



నల్లమల అటవీ ప్రాంతం



- చుట్టూ 10 కి.మీ., పరిధిలో అటవీశాఖ ఆంక్షలు
- పెద్దపులులు, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు
- ఏడు శాఖల సమన్వయంతో కమిటీ ఏర్పాటు
- కేంద్ర ప్రభుత్వ అనుమతి తర్వాతే అమలులోకి..

సాక్షి, నాగర్‌కర్నూల్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని పెద్దపులులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఎకో సెన్సిటివ్ జోన్ ద్వారా నల్లమలలోని వన్యప్రాణులకు హాని లేకుండా ఇక్కడి అరుదైన వృక్ష, జంతుజాతులను పరిరక్షించేలా అధికారులు కసరత్తు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించాక ఎకో సెన్సిటివ్ జోన్ పరిమితులు అమలులోకి వస్తాయి. ఆ తర్వాత నల్లమల చుట్టుముట్టూ సుమారు 10 కి.మీ., దూరం వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణ పనులు చేపట్టాలన్నా ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) కమిటీ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం నల్లమల అటవీ ప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని కోర్ ఏరియాతోపాటు బఫర్ జోన్ ఏర్పాటు ద్వారా రక్షణ కొనసాగుతుండగా.. ఎకో సెన్సిటివ్ జోన్‌తో వన్యప్రాణులకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడనుంది.

జోన్ పరిధిలో 9 మండలాలు..

నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ నిబంధనల ప్రకారం టైగర్ రిజర్వ్‌లో పెద్ద పులులకు అనుకూలమైన వాతావరణం కొనసాగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇందుకు ఆటంకం కలిగించే అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. జిల్లాలోని అమ్రాబాద్, పదర మండలాల్లోని అన్ని గ్రామాలతోపాటు అచ్చంపేట, బల్మూర్, ఉప్పునుంతల, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, లింగాల మండలాల్లోని అటవీ ప్రాంత సమీప గ్రామాలు ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోకి రానున్నాయి. వీటి పరిధిలో మైనింగ్ తవ్వకాలు, బ్లాస్టింగ్, కాలుష్య కారక పరిశ్రమలపై ఆంక్షలు ఉంటాయి. అలాగే విద్యుత్ లైన్ల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు కమిటీ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది.

పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ

ఎకో సెన్సిటివ్ జోన్ పరిరక్షణకు జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే కమిటీ ప్రత్యేకంగా పర్యవేక్షణ బాధ్యత చేపట్టనుంది. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించనుండగా.. డీఎఫ్‌ఓ కన్వీనర్‌గా, అదనపు కలెక్టర్లు, అటవీ, రెవెన్యూ, వ్యవసాయ, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, ఖనిజాలు, విద్యుత్ శాఖలకు చెందిన జిల్లా అధికారులు కమిటీ సభ్యులుగా ఉంటారు.

జీవవైవిధ్యం కొనసాగేలా..

నల్లమల అడవిలోని జీవ వైవిధ్యాన్ని సంరక్షించడంతోపాటు వన్యప్రాణులకు, స్థానికులకు మధ్య ఘర్షణను నివారించేందుకు ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటు కానుంది. నల్లమలలోని పులులు, వన్యప్రాణులకు హానికరమైన పరిస్థితులు తలెత్తకుండా, సరిసృపాలు, తేనె టీగలు, ఇతర అరుదైన జంతువుల మనుగడకు ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకోనున్నారు. కోర్ ఏరియాతోపాటు సమీప ప్రాంతాల్లో వన్యప్రాణులకు అనుకూల వాతావరణం కల్పిస్తారు.

■ 1986 అటవీ, పర్యావరణ పరిరక్షణ చట్టం, నేషనల్ వైల్డ్ లైఫ్ యాక్షన్ ప్లాన్ ప్రకారం నిర్దేశిత అటవీ ప్రాంతాన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించేందుకు అవకాశం ఉండగా.. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఎకో సెన్సిటివ్ జోన్‌లో ప్రధానంగా వన్యప్రాణుల వేట, మైనింగ్, రంపపు మిల్లులు, కాలుష్య కారక పరిశ్రమలు, శబ్దం చేసే పరిశ్రమలు, వన్యప్రాణుల మనుగడకు ముప్పు కలిగించే అంశాలపై నిషేధాజ్ఞలు కొనసాగుతాయి. అలాగే చెట్ల నరికివేత, నీటిని వాణిజ్య అవసరాలకు వినియోగించడం, ప్లాస్టిక్ వ్యర్థాలు, వ్యవసాయంలో పురుగు మందు వినియోగంలో ఆంక్షలు విధిస్తారు. రోడ్ల నిర్మాణం, విద్యుత్ లైన్ల ఏర్పాటు, తవ్వకాలు చేపట్టేందుకు మాత్రం ఎకో సెన్సిటివ్ జోన్ కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకొని పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది. వ్యవసాయంతోపాటు చేపల పెంపకం తదితర అనుబంధ పనులకు ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు.

ఎకో టూరిజం వైపు అడుగులు

నల్లమల అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అటవీశాఖ కృషిచేస్తోంది. ఇప్పటికే మన్ననూర్ కేంద్రంగా టైగర్ స్టే ప్యాకేజీలు, ట్రెక్కింగ్, జంగిల్ సఫారీ వంటివి చేపడుతోంది. ఇందులో స్థానిక చెంచు యువకులను టూరిస్టు గైడ్లు, ఫారెస్ట్ వాచర్లుగా నియమిస్తోంది. ఇక ముందు కూడా ఈ కార్యక్రమాలను విస్తృతపర్చడం ద్వారా ఎకో టూరిజం సర్వీసులను మరింత అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రకృతి అందాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకుల కోసం వసతులు పెంచడం ద్వారా మరింత మంది స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రతిపాదనలు పంపించాం..



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ చుట్టుపక్కల ప్రాంతాలను ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించేందుకు ప్రక్రియ ప్రారంభమైంది. నల్లమల అటవీ ప్రాంతం, అరుదైన వన్యప్రాణుల రక్షణ కోసం ఎకో సెన్సిటివ్ జోన్ ఉపయోగపడనుంది. అటవీ ప్రాంతం సమీపంలో చేపట్టే కార్యక్రమాలపై కమిటీ ద్వారా ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుంది.

– రోహిత్, డీఎఫ్‌ఓ, నాగర్‌కర్నూల్

ముగిసిన లక్ష్మీచెన్నకేశవస్వామి జాతర

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజున ఆలయ పండితులు స్వామివారి విగ్రహానికి చక్రతీర్థం జరిపించడంతో ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులచే నిత్యహోమం జరిపించి మహా పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ధ్వజ అవరోహణం గావించి చక్రతీర్థసేవ చేశారు. ద్వాదశారాధనలు, శ్రీపుష్పయాగం, నాగబలి, దేవతోద్వాసన, సప్తవర్ణ సేవలు నిర్వహించారు.



ప్రైవేటుకు వెళ్లండి..

కుటుంబ నియంత్రణ, కాన్పులకు వచ్చిన వారిని ప్రైవేటు ఆస్పత్రికి రెఫర్ చేస్తున్న సిబ్బంది

■ ఊర్కొండ మండలంలోని జకినాలపల్లికి చెందిన పోలె రజిత కుటుంబ నియంత్రణ నిమిత్తం ఈ నెల 8న కల్వకుర్తి పట్టణంలోని సీహెచ్‌సీకి వెళ్లింది. బెడ్లు ఖాళీగా లేవు, ఇప్పుడు కుదరదు, మీకు కాన్పు జరిగి రెండేళ్లు దాటలేదు అనే కారణాలతో ఆపరేషన్ చేయలేదు. సదరు మహిళ మళ్లీ ఈ నెల 15న ఆస్పత్రికి వెళ్లగా.. ఇక్కడ ఆపరేషన్ చేయటం కుదరదని ఆస్పత్రిలోని సిబ్బంది చెప్పేశారు. ఈ నెల 16న పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి (ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే వైద్యురాలి)లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించారు. వైద్యఖర్చులు, ఇతర ఖర్చులన్నీ కలిపి మహిళకు రూ.25వేల వరకు బిల్లు చేశారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు సంబంధించి ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఆమెకు నెలలు తక్కువగా ఉన్నాయని కాన్పునకు ఆపరేషన్‌కు మధ్య రెండు సంవత్సరాల వ్యవధి ఉండాలన్నారు. నిబంధనల ప్రకారం ఆమెకు ఆపరేషన్ చేయలేమని చెప్పారు. కాని అప్పటికే ఆమెకు కాన్పు జరిగి రెండు ఏళ్ల నాలుగు నెలలైంది.

■ ఇటీవల కొద్ది రోజుల కిందట ఓ మహిళ పురిటినొప్పులతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. ఆపరేషన్‌కు సిద్ధం చేయాలని సంబంధిత గైనకాలజీ వైద్యుడు వారి సిబ్బందికి సూచించాడు. ఏమి పట్టనట్టుగా ఆ సిబ్బంది ఆపరేషన్ చేయటం ఇక్కడ కుదరదని, ప్రైవేటు ఆస్పత్రి వెళ్లాలని సూచించారు. గైనకాలజీ వైద్యుడు సిబ్బందిని గట్టిగానే మందలించి ఎట్టకేలకు ఆపరేషన్ చేశాడు. ఇలా ఆపరేషన్ చేసినందుకు ఆ వైద్యుడికి ఉన్నతాధికారులతో సదరు సిబ్బంది గట్టిగానే మొట్టికాయలు వేయించారు.



కల్వకుర్తి పట్టణంలోని సీహెచ్‌సీ

- కాన్పుల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్న కల్వకుర్తి ఆస్పత్రి. నేడు వెనుకంజ
- విషయం తెలిసినా ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు
- సామాన్య ప్రజలను దోచుకుంటున్న పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు
- జంకుతున్న సామాన్య ప్రజలు

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులను ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది, అదే ఆస్పత్రిలో పనిచేసే వైద్యుల ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేయటం షరామామూలుగా మారింది. రెఫర్ వ్యవహారంపై ఎన్ని ఆరోపణలు వచ్చినా, విమర్శలు వచ్చినా వైద్యులు, ఉన్నతాధికారులు ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

ఆరు నెలల కిందట మొదటి స్థానం..

గత ప్రభుత్వంలో ఆరు నెలల కిందట రాష్ట్రంలోనే కాన్పుల్లో మొదటి స్థానంలో ఉన్న ఆస్పత్రి కొన్ని నెలల నుంచి వెనుకబడిపోయింది. ఆస్పత్రిలో పనిచేసే గైనకాలజిస్టు వైద్యుడిని ఆస్పత్రిలో పనిచేసే ఇద్దరు వైద్యులతో పాటుగా మరో ఇద్దరు ప్రైవేటు వైద్యులు బాగానే ఇబ్బందిపెట్టారని తెలిసింది.

ఏళ్లుగా పాతుకుపోయారు..

ఆస్పత్రిలో పనిచేసే కొంత మంది వైద్యులు ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోవటం ఇలాంటి వివాదాలు, సామాన్య ప్రజలకు ఇబ్బంది ఎదురవ్వడానికి ప్రధాన కారణంగా చెప్పాలి. ఇతర ప్రాంతాలకు వారిని బదిలీ చేసినా ఏదో కారణాలతో తిరిగి కల్వకుర్తి ఆస్పత్రికి డిప్యూటేషన్లు తీసుకొని మరీ ఇక్కడే పనిచేస్తున్నారు. ఇలా పనిచేయడానికి వారు కట్టుకున్న ప్రైవేటు ఆస్పత్రులను బతికించుకోవడానికి అని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు ఉన్నా.. స్థానిక నాయకులు కొంతమంది వారి బదిలీలకు అడ్డుగా ఉంటున్నారు.

సమయపాలన పాటించరు..

కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే వైద్యుల్లో కొంతమంది అసలు సమయపాలనే పాటించడంలేదు. పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహించే ఇద్దరు వైద్యులు(ప్రభుత్వ వైద్యులు) ఉదయం 9 గంటలకు రావాల్సిన వారు తీరికగా ఉదయం 11 గంటలకు రావటం వారికి పరిపాటిగా మారింది. ఇంకో వైద్యురాలు మాత్రం తను వచ్చిందే సమయం, చూసినవారే రోగులు అన్నట్టుగా పరిస్థితి తయారైంది.

విచారణ చేపడుతాం



కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో ఇలాంటి సంఘటనలు చాలానే జరుగుతున్నాయని దృష్టికి వచ్చింది. ఆస్పత్రిలో వరుస సంఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతాం. రెఫరల్ వ్యవహారం చాలా తీవ్రంగా పరిగణిస్తాం. ఆస్పత్రికి వచ్చే సామాన్య ప్రజలకు తప్పకుండా ఆస్పత్రిలోనే వారికి వైద్య సేవలు అందించాలి. ఆస్పత్రిలో నయం కాని వాటిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలి తప్పా.. ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేయరాదు. ఆస్పత్రిలో వైద్యులు, నర్సింగ్, కిందిస్థాయి సిబ్బంది రెఫర్ పాత్రపై పూర్తిస్థాయి విచారణ చేయిస్తాం.

– డా.రమేష్‌చంద్ర, డీసీహెచ్‌ఎస్, నాగర్‌కర్నూల్

పోలీస్ శాఖలో బదిలీల పర్వం

కొత్తగా ఆరుగురు డీఎస్పీలకు స్థానచలనం

మహబూబ్‌నగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో దశల వారీగా పోలీస్ శాఖలో ఉన్నతాధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీలకు స్థానచలనం కల్పించగా.. మరోసారి ఆదివారం ఆరుగురు డీఎస్పీలు స్థానచలనం కల్పించారు. ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులతోపాటు ఇటీవల వచ్చిన వారికి సైతం బదిలీ చేశారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు ఇలా ప్రతి విభాగంలో మార్పులు, చేర్పులు జరిగాయి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో కొత్తగా విధుల్లో చేరిన అధికారులే కనిపిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ప్రస్తుతం విధుల్లో చేరిన అధికారులు ఆయా ప్రాంతాలపై పట్టు సాధించాల్సి ఉంది. ఒకవైపు నేరాలు, చోరీలు, శాంతిభద్రతలు అదుపు చేయడంతోపాటు.. మరోవైపు ఎన్నికల విధులపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

■ జోగుళాంబ గద్వాల జిల్లాలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.రవిని వరంగల్ జిల్లా అదనపు డీసీపీ(అడ్మిన్)గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో గద్వాల జిల్లా అదనపు ఎస్పీగా ఇంకా ఎవరిని కేటాయించలేదు.

డీఎస్పీ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
మురళీకృష్ణ	హైదరాబాద్ వెయిటింగ్	డీటీసీ జడ్చర్ల
ఎన్.రామారావు	డీటీసీ జడ్చర్ల	టీఎస్‌పీఏ
నాగభూషణం	డీజీపీ ఆఫీస్	మహబూబ్‌నగర్ ఎస్‌బీ
కిరణ్	మహబూబ్‌నగర్ ఎస్‌బీ	హైదరాబాద్ సీటీ, సీసీఎస్
కృష్ణకిషోర్	అచ్చంపేట, నాగర్‌కర్నూల్	డీసీఆర్‌బీ వర్టికల్స్, వనపర్తి
పార్థసారథి	కల్వకుర్తి, రిపోర్ట్ డీజీపీ ఆఫీస్	ఏసీపీ ఎస్‌బీ, వరంగల్



సేవాలాల్ మార్గంలో నడవాలి

ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట: దేశంలోని 11 కోట్ల బంజారా జాతిని సన్మార్గంలో నడిపించిన ఆరాధ్యదైవంగా సంత్ సేవాలాల్ మహారాజ్ నిలిచారని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం అచ్చంపేట గిరిజన్ భవన్ వద్ద నియోజకవర్గం నుంచి తరలివచ్చిన బంజారా గిరిజనులు సేవాలాల్ మహారాజ్ 285 జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ మినీస్టేడియం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరతరాలుగా బంజారాలు వివక్షకు గురై ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధిలో నడిపించాల్సి బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సేవాలాల్ ఆలయం కోసం ఎకరా భూమి కేటాయిస్తామని, వచ్చే సంవత్సరం ఉత్సవాలు కొత్తగా నిర్మించే ఆలయంలో జరపాలన్నారు. మహమ్మద్ ఘూరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ పక్షాన పోరాడిన వీరోచిత చరిత్ర బంజారాలదన్నారు. కార్యక్రమంలో డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మంత్రునాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ కె.తులసీరాం, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ఎస్.బిచ్యానాయక్, కె.రాములు నాయక్, శంకర్‌రాథోడ్, లచ్చునాయక్, దేశ్యానాయక్, ధర్మనాయక్, గోపాల్‌నాయక్, రాజ్‌గోపాల్, మంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వరినాట్లపై రైతులకు అవగాహన



మహిళా రైతులకు వరినాట్లపై అవగాహన కల్పిస్తున్న రావేప్ విద్యార్థులు

తెలకపల్లి: వరినాట్లు ఎలా వేసుకోవాలనే దానిపై పాలెం వ్యవసాయ కళాశాల రావేప్ విద్యార్థులు ఆదివారం మండల పరిధిలోని పర్వతాపూర్‌లో మహిళా రైతులకు అవగాహన కల్పించారు. కాలి బాటలు వరిలో వదిలిపెట్టడంతో వరిపైరుకు గాలి తగిలి పంట ఏపుగా వస్తుందని తెలియజేశారు. అంతే కాకుండా వీటితో సుడిదోమ తీవ్రత తగ్గుతుందని, కాలి బాటలుండటంతో వరిలో అంతర కృషి పనులు చేయడానికి సులువవుతుందన్నారు. రైతులు వరి పొలాలను వరి నాటుకునేందుకు సిద్ధంగా ఉంచుకోవాలని, నారుమడికి ముందు ఎలా ఎరువులు వేసుకోవాలి, ఎలాంటి ఎరువులు వాడితే నారు ఏపుగా పెరిగి దిగుబడి వస్తుందో రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వరిలో వచ్చే తెగుళ్లను నివారించుకోవచ్చున్నారు. ప్రతి రైతు నారుమడిలో ముందుగా సేంద్రియ పద్ధతిలో ఎరువులను వాడితే దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రావేప్ విద్యార్థులు విశ్వతేజ, అనూజ, స్వేత, ద్వారకామయి, సుభద్ర, రైతులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ సదస్సును విజయవంతం చేయండి

తాడూరు: ఏఐడీఆర్ఎం జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో కొనసాగనున్నాయని, మొదటి రోజు నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో రాష్ట్ర సదస్సు జాతీయ సమావేశాల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కేంద్రంలో మోదీ సర్కార్ ఏర్పడిన అనంతరం రాజ్యాంగం కల్పించిన దళిత హక్కులపై దాడి తీవ్రతరం చేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయకుండా వారి నిధులను పక్కదారి పట్టిస్తూ.. తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నిత్యావసర వస్తువులు కూరగాయాలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు అడ్డగోలుగా పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, ఈ ప్రభుత్వమైన లబ్ధిదారులకు తక్షణమే అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, శేఖర్, భార్గవ్, రాజు, రాములు, అనిల్ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

నేటినుంచి మన్యంకొండ బ్రహ్మోత్సవాలు

కోటకదిర నుంచి గుట్టపైకి స్వామివారి ఊరేగింపు

మహబూబ్‌నగర్ రూరల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 7 గంటలకు కోటకదిరలోని అళహరి వంశీయుల ఇంటి నుంచి ప్రత్యేక పూజలు అనంతరం దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో భక్తులు శోభాయమానంగా అలంకరించిన పల్లకిలో స్వామివారిని గుట్టపైకి ఊరేగింపుగా తీసుకువస్తారు. సన్నాయి వాయిద్యాలు, బ్యాండుమేళ తాళాలు, భక్తుల కోలాటాల మధ్య స్వామివారి పల్లకీసేవ ముందుకు కదులుతుంది. కాగడాల వెలుతురులో స్వామివారిని గుట్టపైకి తీసుకువచ్చి సంప్రదాయ రీతిలో ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఉత్సవాలకు ముందు ఈ విధంగా స్వామివారిని కోటకదిర నుంచి గుట్టపైకి తీసుకురావడం అనాదిగా ఆనవాయితీ.

వెలుస్తున్న దుకాణాలు

ఉత్సవాల సందర్భంగా మన్యంకొండలో వివిధ తినుబండారాల దుకాణాలు వెలుస్తున్నాయి. గుట్టపైనున్న తేరు మైదానం, దిగువకొండ వద్ద దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. తినుబండారాలతో పాటు వివిధ ఆట వస్తువులు, వంట, పూజ సామగ్రి, గాజుల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే హోటళ్లు, సినిమా హాళ్లు కూడా వెలుస్తున్నాయి.



మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం

క్లుప్తంగా

సీఓఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

మన్ననూర్: స్థానిక పీటీజీ పాఠశాల/కళాశాలలో ఆదివారం నిర్వహించిన కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) ప్రథమ సంవత్సరంలో ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 384 మంది విద్యార్థులకు గాను 375 మంది పరీక్షకు హాజరయ్యారని పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి, డిపార్టుమెంటల్ అధికారిణి వాణి సరళ తెలిపారు. 9 మంది విద్యార్థులు గైర్హజరయ్యారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న నేషనల్ హైవే పనులు



పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167 జాతీయ రహదారి పనులు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో సైడు కాలువలతో పాటు పైప్‌లైన్ పనులు చేస్తున్నారు. మండలంలో సంజీవాపూర్ నుంచి సాతాపూర్ వరకు రోడ్డు పనులు వేగవంతం చేశారు. ప్రస్తుతం గుట్టల వద్ద మట్టిని తొలగిస్తున్నారు.

బీసీ కుల గణనతో న్యాయం

మన్ననూర్: బీసీ కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోలి మల్లేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. బీసీ కుల గణన కోసం బీసీ సామాజిక వర్గాలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం శుభపరిణామన్నారు. దీంతో జనాభాలో సగ భాగంగా ఉన్న బీసీ వర్గాలకు అన్ని రంగాలలో సరైన ప్రాధాన్యత, సముచిత స్థానం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి శిక్షణకు ఉపాధ్యాయుడు ఎంపిక



వెల్దండ: గుజరాత్ రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి ఐటీటీ గాంధీ నగర్ నిర్వహించనున్న శిక్షణకు జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక అయ్యారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి ఎంపికయ్యారు. జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికైన ఉపాధ్యాయులను డీఈఓ గోవిందరాజులు, ఎంఈఓ శంకర్‌నాయక్, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు అభినందించారు.

మల్లయ్య సేవలు మరువలేం



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల దివంగత సర్పంచ్ మల్లయ్య సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ అన్నారు. ఆదివారం మండలంలోని మార్చాలలో మల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలాజీ సింగ్ మాట్లాడుతూ పదవిలో ఉండగానే ఆయన మృతిచెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ జగన్, నిజాముద్దీన్, శ్రీధర్‌రెడ్డి, భారతి, షానావాజ్‌ఖాన్, జలాల్, మక్బూల్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లెలమ్మ ఉత్సవాలు



కొల్లాపూర్: పట్టణ సమీపంలోని మల్లెలమ్మ ఉత్సవాలను మహేంద్ర(మ్యాదరి) కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. మహేంద్ర సంఘం అధ్యక్షుడు పిస్సంశెట్టి బాలు, నాయకులు ప్యారసాని మురళి, పులి భరత్, సుధాకర్, వెంకటస్వామి, బాలయ్యతో పాటు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గ్రంథాలయం


వరండాలో పత్రికలు చదువుతున్న పాఠకులు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడంతో పాఠకులకు ఇబ్బందులు తప్పడం లేదు. పదేళ్లుగా లైబ్రేరియన్ నియామకం చేపట్టకపోవడంతో పుస్తకాల గదికి తాళం వేసే దర్శనమిస్తోంది. దీంతో పాఠకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న ఒకటి రెండు దిన పత్రికలను చదివి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పోటీ పరీక్షలకు ఉపయోగపడే వార, మాస పత్రికలు ఏమాత్రం అందుబాటులో ఉంచడంలేదని విద్యార్థులు, యువకులు ఆవేదన చెందుతున్నారు.

రెండు వేలకు పైగా పుస్తకాలు

గ్రంథాలయంలో మహనీయులకు సంబంధించిన పుస్తకాలతోపాటు మహాభారతం, పంచతంత్రం, విశ్వరహస్యం వంటి వివిధ రకాలైన రెండు వేలకు పైబడి పుస్తకాలు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. పుస్తకాల గదికి ఎప్పుడు తాళం వేసి ఉంచడంతో చదవలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సెలవు దినాల్లోనూ గ్రంథాలయంలోని పుస్తకాలు చదివే అవకాశం లేదని వారు వాపోతున్నారు.

ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఉన్నా..

అచ్చంపేట లైబ్రేరియన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో ఆమె నెలలో ఒకటి రెండు పర్యాయాలు మాత్రం ఇక్కడకు వచ్చి వెళ్తోంది. కేవలం పేపర్ బిల్లులు ఇవ్వడానికి మాత్రమే ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ వచ్చి వెళ్తుండటంతో పుస్తకాలు చదువుకునే వీలులేకుండా పోయిందని పాఠకులు వాపోయారు. ఎక్కువ రోజులు పుస్తకాలను కదిలించకపోవడంతో విలువైన పుస్తకాలను చెదలు పట్టిపోయాయి. ఇప్పటికే చాలా పుస్తకాలు పాడు కావడంతో వాటిని మూలన పడేశారు. గ్రంథాలయం పాఠకులకు ఎంతవరకు ఉపయోగపడుతుందనే అంశాన్ని అటు అధికారులుగాని, ఇటు ప్రజాప్రతినిధులు గాని ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకొని రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



స్థానిక గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ నియమించాలని అధికారులకు విన్నవించాం. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్నేళ్లుగా గ్రంథాలయంలో పుస్తకాలను ఇంటికి తీసుకొని చదువుకునేందుకు వీలులేకుండ పోయింది. గ్రంథాలయం ఎవ్వరికి ఉపయోగపడటంలేదు. సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– అనుపటి నాగరాజు, పాఠకుడు, ఉప్పునుంతల

ప్రమాదకరంగా రహదారి


శ్రీశైలం-నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి

బల్మూర్: ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే శ్రీశైలం–నాగర్‌కర్నూల్–అచ్చంపేట ప్రధాన రహదారి గుంతల మయంగా మారి ప్రమాదకరంగా మారింది. మరమ్మతుపై ఆర్‌అండ్‌బీ అధికారులు ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని ప్రజలు, వాహనచోదకులు మండిపడుతున్నారు. మండలంలోని తుమ్మెన్‌పేట స్టేజీ నుంచి మహాదేవ్‌పూర్ స్టేజీ వరకు ఏడు కిలోమీటర్లు గుంతలమయంగా మారింది. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి శ్రీశైలం వెళ్లే వాహనదారులు రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం ప్యాచ్ వర్కులు కూడా చేయడం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం రోడ్డుపై కంకర తేలి గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోయారు. అధికారులు స్పందించి కనీసం ప్యాచ్ వర్కుతోనైనా గుంతలను పూర్చి రోడ్డును పూర్తి స్థాయిలో బాగుచేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నామమాత్రంగా నిర్వహణ పనులు


బల్మూర్-అచ్చంపేట ప్రధాన రహదారి పక్కన పిచ్చి మొక్కలు

బల్మూర్: అచ్చంపేట నుంచి బల్మూర్ మీదుగా లింగాల వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై చేపట్టిన ప్యాచ్ వర్కు పనులు తూతు మాత్రంగా కొనసాగుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ నామమాత్రంగా పనులు చేపడుత్నురు. రోడ్డుపై చాలా చోట్ల ఉన్న గుంతలను పూడ్చకుండానే చేతులేశాడు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంప చెట్ల తొలగించలేదు. అధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఏమాత్రం పర్యవేక్షణ చేయకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోందని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: నియోజకవర్గ విద్యార్థుల కోసం కోసా సంస్థ ఆధ్వర్యంలో పాలిసెట్ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆసంస్థ అధ్యక్షుడు పి.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శశికాంత్ వాల్మీకి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. కోసా యొక్క లక్ష్యాలను వారు మంత్రికి వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు హైదరాబాద్‌లో సాయిమేధ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3 వతేదీన అర్హత పరీక్ష నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఉచిత కోచింగ్‌తో పాటు, బోర్డింగ్ వసతులు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సభ్యులు కోరారు. మంత్రిని కలిసిన వారిలో రిటైర్డ్ డీఆర్‌ఓ మదన్‌మోహన్‌రావు, మియ్యాపురం రమేష్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప పండుగ


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, భక్తులు

తెలకపల్లి: మండలంలోని కమ్మరెడ్డిపల్లిలో ఆదివారం కురుమ కులస్తుల బీరప్ప పండుగలు కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలో విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. ప్రధాన వీధుల్లో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు బోనాలను అలంకరించుకుని ఊరేగింపుగా బయలుదేరారు. డప్పు చప్పుళ్ల మధ్య యువకులు నృత్యాలు చేశారు. వివిధ వేషధారణతో ఆకట్టుకున్నారు. అనంతరం బీరప్ప దేవాలయం వద్ద నైవేద్యం సమర్పించారు. రెండు రోజులుగా గ్రామంలో పండుగ కొనసాగుతుందని గ్రామస్తులు తెలిపారు.

22న బండలాగుడు పోటీలు

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 22న గురువారం అంతర్రాష్ట్ర వృషభరాజుల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 22న ఉదయం 11 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40 వేలు, 3వ బహుమతి రూ.30 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు ఇస్తామని వివరించారు. పోటీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



వెల్దండ: మండల కేంద్రంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో మంజూరైన సీసీరోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చెందడంతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు సంజీవ్‌కుమార్, మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు ఎర్రశ్రీనుముదిరాజ్, కృష్ణముదిరాజ్, పుల్లయ్య, హమీద్, మల్లేష్‌ముదిరాజ్, అల్లీ తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్‌లో తూడి లక్ష్మమ్మ ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి ఇంట్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మంగనూర్ గ్రామానికి చెందిన తూడి లక్ష్మమ్మ శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్క ఇంట్లో నిద్రించింది. తెల్లవారుజామున లేచి చూసే సరికి ఇంటి, బీరువా తాళాలు విరగొట్టి బీరువాలో ఉన్న 20 గ్రాముల బంగారం, వెండి నగలు చోరీకి గురయ్యాయి. బాధితురాలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లిలో ఈ నెల 14 నుంచి బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దేవాలయ సమీపంలో దుకాణాలు, తినుబండారాల సముదాయాలు వెలిశాయి. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి జాతరకు భక్తులు, ప్రజలు తరలివస్తున్నారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. రెండు మూడు రోజుల పాటు జాతర ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బీజేపీకి తగిన గుణపాఠం నేర్పాలి



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

వీపనగండ్ల: కేంద్రంలో అధికారాన్ని చలాయిస్తున్న భారతీయ జనతా పార్టీ సామాన్య ప్రజలు, రైతుల బాగోగులను పట్టించుకోకపోవడంలో ఘోరంగా విఫలమైందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తగిన గుణపాఠాన్ని నేర్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసాన్ని తొలగించాల్సింది పోయి కులమతాల మధ్య తారతమ్యాలను సృష్టించి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తుందని దుయ్యబట్టారు. న్యాయమైన హక్కుల కోసం దేశ రాజధానిలో శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్న రైతులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ సామాన్య ప్రజల హక్కులను హరిస్తున్న బీజేపీకి ఓటు ద్వారా తగిన గుణపాఠం నేర్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర్లగౌడ్, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధికం సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు, వ్యవసాయ కూలీలకు వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో మైసమ్మ దేవతను దర్శించుకునేందుకు కుటుంబసభ్యులతో తరలి వచ్చారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదువేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన వారోత్సవాలు

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయ ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన పంచమ వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, భజనలు, అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తగిన ఏర్పాట్లను నిర్వాహకులు పర్యవేక్షించారు.

20న చలో సచివాలయం

అచ్చంపేట రూరల్: ధూప దీప నైవేద్య పథకం కింద అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న నిర్వహించనున్న చలో సచివాలయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అర్చక సంఘం నాయకులు శ్రీనివాసశర్మ, శ్రీకుమార్‌శర్మ, మురళీధర్ శర్మ, నాగరాజుశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. నూతనంగా నియామకమైన అర్చకులకు ఏడు నెలల నుంచి గౌరవ వేతనం అందడం లేదని వివరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల అర్చకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

బెస్ట్ టీఎల్‌ఎం మేకర్లుగా ఎంపికైన ఉపాధ్యాయులు

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వెంకటేష్, పద్మావతి రాష్ట్రస్థాయిలో బెస్ట్ టీఎల్‌ఎం మేకర్లుగా ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుడు వెంకటేష్ తయారుచేసిన జియోబోర్డు టీఎల్‌ఎంను, ఉపాధ్యాయురాలు పద్మావతి తయారుచేసిన మానవశరీర నిర్మాణం అనే టీఎల్‌ఎంను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంఈఓ రామారావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆకుపై ఆకట్టుకున్న శివాజీ చిత్రం



కల్వకుర్తిరూరల్: పట్టణానికి చెందిన విద్యార్థి యశ్వంత్‌కుమార్ పలు చిత్రాలను గీస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. ఆదివారం ఛత్రపతి శివాజీ చిత్రాన్ని ఆకుపై గీసీ పలువురి నుంచి ప్రశంసలు అందుకున్నాడు. రెండు గంటల పాటు శ్రమించి ఆకుపై శివాజీ చిత్రన్ని గీశానని విద్యార్థి తెలిపారు. దీంతో పలువురు యశ్వంత్‌ను అభినందించారు.

అందుబాటులో యూరియా

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని సీఈఓ భాస్కర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్తా ధర రూ.270 చెల్లించి కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, అధార్‌కార్డు తీసుకొచ్చి యూరియాను పొందవచ్చని ఆయన తెలిపారు. రైతులు ఎరువులను బయటి మార్కెట్‌లో కొనుగోలు చేసి నష్టపోవద్దని, సింగిల్ విండో కార్యాలయంలోనే కొనుగోలు చేయాలని కోరారు.

రోడ్డు మధ్యలో గాంధీ విగ్రహం తొలగేనా?


రోడ్డు మధ్యలో గాంధీ విగ్రహం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డుపై గాంధీ విగ్రహం ఉండటంతో ప్రతి నిత్యం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. రోడ్డు విస్తరణ సమయంలో గాంధీ విగ్రహాన్ని రోడ్డు మధ్య నుంచి తొలగించి గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసేందుకు దిమ్మె నిర్మించినా.. నేటికీ విగ్రహాన్ని తొలగించకపోవడంతో వాహనదారులు ఇబ్బందికి గురవుతున్నారు. గ్రామపంచాయతీ వారు విగ్రహాన్ని తొలగిస్తామని హామీ ఇచ్చినా.. పంచాయతీ పాలకమండలి సభ్యుల గడువు ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ప్రత్యేక అధికారులు స్పందించి రోడ్డు మధ్యలోని గాంధీ విగ్రహాన్ని తొలగించి ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వీడి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


ఊర్కొండపేటలో ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలో ఆపదలో ఉన్న తోటి మిత్రుని కుటుంబానికి పదో తరగతి విద్యార్థులు అండగా నిలిచారు. ఊర్కొండపేటకు చెందిన తిరుమని రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. 2004 బ్యాచ్‌కు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.34 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు మమత, నాజియా, సుమతి, శేఖర్, శంకర్, అశోక్‌రెడ్డి, శివశంకర్, కొండల్, ఖుర్షీద్, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బిజినేపల్లిలో..

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన జగదీశ్వరయ్య ఇటీవల మృతిచెందాడు. దీంతో 1996–1997 సంవత్సరానికి చెందిన మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థులు మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఆదివారం జగదీశ్వరయ్య కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.23000 ఆర్థికసాయం అందజేశారు. కత్తె ఈశ్వర్, జైపాల్, చంద్రోజీ, మల్లీశ్వరి, వసంత, పార్వతమ్మ, లవకుమార్, గోపాల్, అగ్రహార శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా మహిళా సమాఖ్య భవనం


పెద్దకొత్తపల్లిలో మహిళా సమాఖ్య భవనం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. తప్పని పరిస్థితుల్లో ఈ కార్యాలయంలోనే ప్రస్తుతం మహిళా సంఘాల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గ్రూపు సమావేశాలు, బ్యాంకుల సంబంధించిన రుణాలకు సంబంధించిన చర్చలు ఇక్కడి నుంచే జరపాల్సిన దుస్థితి నెలకొంది. భవనం నిర్మించినా కాంట్రాక్టర్ తలుపులు కిటికీలు, ఫ్లోరింగ్ చేయకపోవడంతో మహిళా సమాఖ్య కార్యాలయం వారు భవనాన్ని స్వాధీనం చేసుకుని ఫ్లోరింగ్ లేనందున కింద కవర్లు వేసి కార్యాలయాన్ని వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు పట్టించుకొని మండల మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మహిళలు కోరుతున్నారు.